క్లుప్తంగా

మరో రెండు నామినేషన్ల దాఖలు



ఆర్వో అఖిలకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కె.కె.రాజు, సుమ దంపతులు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు బుధవారం మరో రెండు నామినేషన్లు దాఖలు చేశారు. సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్ డి.అఖిలకు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయన సతీమణి సుమ హాజరయ్యారు. ఈ నెల 19న కె.కె.రాజు నామినేషన్ వేసిన విషయం తెలిసిందే.

'ఉత్తర'లో ఆరు నామినేషన్లు

ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ స్థానాలకు బుధవారం మరో 6 నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి కమ్మిల కన్నప రాజు(కె.కె.రాజు) రెండు సెట్లు, కమ్మిల సుమ, స్వతంత్ర అభ్యర్థులుగా చింతల మల్లికార్జునరావు ఒక సెట్, వడ్డి శిరీష ఒక సెట్, ప్రజా ప్రస్థానం పార్టీ నుంచి కందుల బాలాజీ ఒక సెట్ నామినేషన్ పత్రాలను సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఉత్తర రిటర్నింగ్ ఆఫీసర్ డి.అఖిలకు అందజేశారు.

సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో అన్నదానం



అన్నప్రసాద వితరణలో నిర్వాహకులు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో కార్తికేయ శరవణ ట్రస్టు ఆలయ ధర్మకర్త దేవాల రాజు(కృష్ణ)ఆధ్వర్యంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ శర్మ నేతృత్వంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు దేవాల రాజు అన్నదానాన్ని ప్రారంభించారు. సుమారు 3 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం సుబ్రహ్మణ్య స్వామికి ఇడిం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ చొక్కాకుల కుమారి, కడగల జ్యోతీష్, కార్యదర్శి కాండ్రేగుల రాము, కె.త్రివేణి, కె.సురేష్ కిరణ్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో వైద్య శిబిరం

సీతమ్మధార: ఆదిలీల ఫౌండేషన్, డాక్టర్ రహమతుల్లా సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సీతమ్మధార గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బ్లడ్ సుగర్, యూరిక్ యాసిడ్, థైరాయిడ్, బీఎండీ ఎముకల పరీక్షలు చేశారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో శ్రీరామ్మూర్తి, పి.వి.రమణారావు, జె.మురళీకృష్ణ, ఎస్.శివప్రసాద్, జె.భాస్కరరావు, గణేష్ కుమారి, దేవి ప్రియ పాల్గొన్నారు.

మంచి ర్యాంకులు సాధించాలి



విద్యార్థినికి మెటీరియల్ అందిస్తున్న పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ నారాయణరావు

మురళీనగర్: పాలిసెట్‌లో విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలని పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణరావు ఆకాంక్షించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడానికి శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. 176 మందికి ఉచిత శిక్షణ ఇచ్చామని, పాలిసెట్ గ్రాండ్ మోడల్ టెస్ట్ నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెటీరియ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమమే గెలిపిస్తాయి

- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజా
- 25, 45 వార్డుల ఎన్నికల ప్రచారంలో అపూర్వ ఆదరణ



ఎన్నికల ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న కె.కె.రాజు, సారిపిల్లి గోవింద్ తదితరులు

సీతంపేట: ఎన్నికల ప్రచారంలో ఏ వార్డుకు వెళ్లిన ప్రజల నుంచి అపూర్వమైన ఆదరణ లభిస్తోందని, దానికి కారణం ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలేనని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో బుధవారం సీతంపేటలోని పలు ప్రాంతాల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు వెంటరాగా సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయం వద్ద ప్రారంభమైన ప్రచార ర్యాలీ రాధాకృష్ణాలయం, గొల్లవీధి, గణేష్‌నగర్, రెల్లి వీధి, కనకమ్మ వీధి, సీతంపేట మెయిన్ రోడ్



25వ వార్డు ప్రచారంలో దర్జీలకు అండగా ఉంటామని భరోసా ఇస్తున్న కె.కె.రాజు

ప్రాంతాల్లో సాగింది. ఇంటింటికీ కె.కె.రాజు వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఉత్తర ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. వార్డులో జరిగిన అభివృద్ధిని వివరించి, కరపత్రాలు అందజేశారు.

నిత్యం ప్రజలతోనే ఉన్నా..

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ 2019 ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నానని తెలిపారు. పదవి ఉన్నా.. లేకపోయినా రాజకీయ నాయకులు ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించి వారికి సేవ చేయాలన్నారు. గడిచిన ఐదేళ్ల ప్రజలతో మమేకమై, కరోనా కష్టకాలంలో సైతం ప్రజల మధ్య ఉండి వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూశానని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి స్థానిక సమస్యలు, వారి అవసరాలు తెలుసుకుని, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమన్నారు.

25వ వార్డులో అనేక అభివృద్ధి పనులు

సుమారు రూ.8 కోట్లతో 25వ వార్డులోని జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, ఆర్వో వాటర్, బెంచీలు, డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేశామని కె.కె.రాజు తెలిపారు. వార్డులోని ప్రతి ప్రాంతంలో బీటీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు నిర్మించామని, హైవే పక్కన గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశామన్నారు. రెల్లి వీధిలో రూ.1.50 కోట్లతో కల్యాణ మండపం, రూ.50 లక్షలతో హిందూ ముస్లిం కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరుగుతోందని చెప్పారు. వార్డులో రైతుబజార్, ఆస్పత్రి ఏర్పాటుకు అనుమతులు వచ్చినప్పటికీ స్థలాభావం వల్ల జాప్యం జరిగిందన్నారు.

ఓటమి భయంతోనే వ్యక్తిగత ఆరోపణలు

తనతో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు నాలుగేళ్ల పది నెలల కాలం, చివరకు కరోనా కష్టకాలంలో ఎక్కడికి వెళ్లారని కె.కె.రాజు ప్రశ్నించారు. ఓటమి భయంతోనే విష్ణుకుమార్‌రాజు వ్యక్తిగత ఆరోపణలు, దూషణలు చేస్తున్నారని, ప్రజలంతా గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో వారే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గడిచిన ఐదేళ్లల్లో అధికారులు, కార్పొరేటర్ల సమన్వయంతో చేపట్టిన అభివృద్ధి, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించిన సంక్షేమ పథకాలతో ఉత్తర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో మాజీ కార్పొరేటర్లు జి.వి.రవిరాజు, జి.వి.రమణి, జేసీఎస్ మండల కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు బోగవిల్లి గోవింద్, సచివాలయ కన్వీనర్లు సాన బోయిన సురేష్, వెంపటాపు నూకరాజు, పద్మ, సంధ్య, వీరమ్మ, పోతిబంతి హరికృష్ణ, గోవిందమ్మ, శేఖర్, సన్నీ, లక్ష్మణకుమార్, బొమ్మాళి రవి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.



25వ వార్డు సీతంపేటలో పరుపులు కుడుతున్న వృత్తిదారుడి బాగోగులు అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

కె.కె.రాజు గెలుపు.. అభివృద్ధికి మలుపు



45వ వార్డులో ప్రచారం చేస్తున్న చొక్కాకుల వెంకటరావు, కంపా హనోకు, పైడి రమణ

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును గెలిపించుకోవాలని, ఆయన గెలుపు.. నియోజకవర్గ అభివృద్ధికి కీలకమని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోకు అన్నారు. వార్డులోని ఏఎస్సార్ నగర్‌లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని, ఉత్తర ఎమ్మెల్యేగా కె.కె.రాజును గెలిపించుకోవాలని కోరారు. గత పాలకులు, ఎమ్మెల్యేలు ఈ ప్రాంత వాసులను మోసం చేసి వదిలేశారని, కె.కె.రాజు ప్రత్యేక చొరవతో ఇక్కడ ఇళ్లు కట్టించి, ప్రతీ ఒక్కరికి ఉచితంగా వాటి రిజిస్ట్రేషన్లు కూడా చేయించి, ఇంటి పట్టాలను నేరుగా మీచేతికే వచ్చేలా చేశారని పేర్కొన్నారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.



ఏఎస్సార్ నగర్‌లో కె.కె.రాజుకు హారతులతో స్వాగతం పలుకుతున్న స్థానికులు

దీవించండి.. మరింత సేవ చేస్తా: కె.కె.రాజు

ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో గెలుపోటములతో సంబంధం లేకుండా నిత్యం ప్రజలతో మమేకమై ఉన్నానని, అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానని తెలిపారు. ఈ సారి ప్రజలంతా ఆశీర్వదిస్తే ఎమ్మెల్యేగా సేవలందిస్తూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరిపట్నాయక్, సతీష్, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో యువత చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన యువతతో కె.కె.రాజు, కంపా హనోకు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు వాసుదేవనగర్, సంతోషిమాత కాలనీలకు చెందిన పలువురు యువతీ యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులోని పార్టీ ప్రచార కార్యాలయంలో బుధవారం కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వీరికి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సార్వత్రిక ఎన్నికల్లో యువకులంతా కష్టపడి పనిచేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఏర్పాటు చేయగలిగితే తిరిగి రాజన్న రాజ్యం జగనన్న ద్వారా సాధించుకోగలమని ఈ సందర్భంగా కె.కె.రాజు అన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, పార్టీ నాయకులు హరిపట్నాయక్, నానిబాబు, యాకోబు, సన్ని తదితరులు పాల్గొన్నారు.

సంగీతంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్ ప్రాంగణంలోని సంగీత జనకులంలో సంగీతంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్రీయ, వాయిద్య, గాత్ర సంగీతం, వేదాభ్యాసం వంటి విభాగాల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నామన్నారు. విద్యార్థులు పూర్తి చేసిన దరఖాస్తులతో ఈ నెల 28వ తేదీ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్ ప్రాంగణంలో సంస్థ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను సంప్రదించాలని సూచించారు. కాశీప్రసాద్, వెంకటరమణి ప్రసాద్ దంపతుల నేతృత్వంలో సంగీతం ఉపాధ్యాయులు లక్ష్మీ, శారద సుబ్రహ్మణ్యం వారి శిష్యులచే శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. మహిళా, పురుష భేదం లేకుండా, అన్ని వయసుల వారు పాల్గొనేందుకు అర్హులని, సంగీత జనకులం నియమ నిబంధనలను విద్యార్థులందరూ విధిగా పాటించాలని కాశీప్రసాద్ తెలిపారు. వివరాలకు 93983 14502, 89853 34724 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి



51వ వార్డులో కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజులను గెలిపించాలని కోరుతూ సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. జీవీఎంసీ 51వ వార్డు 242 బూత్ పరిధి కళింగనగర్ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం, సాయంత్రం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన మంచి పాలనను చూసి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి బొత్స ఝాన్సీ, కె.కె.రాజును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీనివాసరావు, బి.తిరుమలరావు, రాజంరాజు, ఎం.దమయంతి, కరిమిరెడ్డి శ్యామ్, రాణి, బాలరాజు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

- 53వ వార్డు భాస్కర్ గార్డెన్స్, శ్రీరాంనగర్ కాలనీల్లో బుధవారం ఉదయం, సాయంత్రం కార్పొరేటర్ బర్కత్ అలీ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, ఇతర నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బలపరిచిన బొత్స ఝాన్సీ, కె.కె.రాజులకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.



53వ వార్డు ప్రచారంలో బర్కత్ అలీ, గుజ్జు వెంకటరెడ్డి తదితరులు



24వ వార్డు నక్కవానిపాలెంలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, పార్టీ శ్రేణులు

మంచి పాలనకు ఓటేయండి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని 163వ బూత్ పరిసర ప్రాంతంలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఉత్తర ఎమ్మెల్యేగా కె.కె.రాజును, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని ప్రజలను ఆమె అభ్యర్థించారు. మీ ఇంటికి మంచి జరిగితేనే జగనన్న ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు. వార్డులో కాలువలు, రోడ్లు వంటి అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల అశోక్‌రెడ్డి, గుజ్జు సతీష్‌రెడ్డి, గుజ్జు లోకేష్‌రెడ్డి, జోన్నలగడ్డ చిన్న, దుంగి కిశోర్‌రెడ్డి, పోలిరెడ్డి, రామిరెడ్డి, దల్లి గురుమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రచయితలకు సామాజిక స్పృహ ప్రధానం

సీతంపేట: కథల్లో మానవ జీవితం, వ్యక్తుల స్వభావం, ప్రాపంచిక సత్యాలు కనిపించాలని సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అన్నారు. రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన కథా కచేరిలో ఆయన ప్రసంగించారు. కథలు పాఠకుల మనసుల్లో చెరగని ముద్ర వేస్తాయని, కథాశిల్పంతో మంచి నేర్పుతో కథను నడిపించాలని సూచించారు. రచయిత డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కథానికకు క్లుప్తత చాలా అవసరమన్నారు. పాత్ర చిత్రణలో జాగరూకత వహించి మంచి నేర్పుతో కథను నడిపించాలన్నారు. అనంతరం జరిగిన కథాకచేరీలో రచయితలు స్ఫూర్తిదాయకమైన కథలు వినిపించారు. కార్యక్రమంలో ఎస్.విజయ్‌కుమార్, సిహెచ్.చినసూర్యనారాయణ, కె.వి.ఎస్.మూర్తి, కొత్తూరి రమణ, భాగవతుల సత్యనారాయణ, అయ్యల సోమయాజుల ప్రసాద్, రామతాత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

చదరంగంతో మెదడుకు పదును

మురళీనగర్: చదరంగం ఆడటంతో మెదడుకు పదును పెట్టవచ్చని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో బుధవారం ఉచిత చదరంగ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెస్ ఆట అవసరమైన పరిస్థితుల్లో ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలో చక్కని ఆలోచనలు కలుగజేస్తుందన్నారు. ఈ శిబిరానికి పరిసర ప్రాంత కాలనీల నుంచి 80 మంది బాల,బాలికలు హాజరయ్యారు. చదరంగం శిక్షకులు సనపల ఉమాపతి, క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి జె.కూర్మారావు, సంయుక్త కార్యదర్శి చల్లంగా ప్రసాదరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లా చంద్రమౌళి

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: విశ్వకళాపరిషత్ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మెగా సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథి ఉపకార్ సేవా ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ చిరంజీవి కళాపరిషత్ పేరిట అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం తాను నిర్మిస్తున్న తొమ్మిది సినిమాల్లో స్థానిక కళాకారులకే ప్రాధాన్యమిచ్చామన్నారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ చిరంజీవిని అందరివాడిగా చూడాలన్నారు. అనంతరం గాయనీ గాయకులు మెగాస్టార్ నటించిన చిత్రాల్లోని గీతాలు ఆలపించి అలరించారు. కళాపరిషత్ అధ్యక్షుడు గెంబలి జగదీష్, గౌరవ అధ్యక్షురాలు విజయరమణి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తి సంకీర్తనా గానం

సీతమ్మధార: సీతమ్మధార గురువాయురప్పన్ శ్రీకృష్ణ మందిరంలో బుధవారం వైదిక విజ్ఞాన విపంచి వ్యవస్థాపకులు భానుప్రసాద్, ఉమామహేశ్వరి దంపతుల సారథ్యంలో పి.రంగనాథ ఆచార్యులు బృందం వైఖానస ఆగమ సంప్రదాయంలో సీతారామ కల్యాణం, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించింది. శ్రీరామచంద్ర స్వామి వారి ఊంజల్ సేవలో భాగంగా నగరానికి చెందిన శృతిలయ సాంస్కృతిక భక్తి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత స్వరార్చన అందరినీ ఆకట్టుకుంది. గాయనీ, గాయకులు వి.ప్రభాకర్, ఎం.ఎస్.మాధవ్, సత్యశ్రీ, పావని, కె.వెంకట సురేష్, నాగలక్ష్మి, శ్రీరాముడు, వేంకటేశ్వరుడిపై ఆలపించిన వివిధ భక్తి గీతాలు పరవశింపజేశాయి. ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ భక్తి సంగీత కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో మెలోడి సంస్థ కార్యదర్శి సిహెచ్.సత్యనారాయణ, కొణతాల రాజు, ఫణి స్వామి, భక్తులు పాల్గొన్నారు.



సీతారాములపై భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

కంటైనర్ సబ్‌స్టేషన్ సిద్ధం

- అక్కయ్యపాలెం హైవేలో రూ.10 కోట్లతో ఏర్పాటు
- నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అధికారుల చర్యలు
- 26వ వార్డు ప్రజల హర్షం



5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్



అక్కయ్యపాలెం హైవేపై గ్రీన్‌బెల్ట్‌లో ఏర్పాటు చేసిన కంటైనర్ సబ్‌స్టేషన్

సీతంపేట: ఈ వేసవిలో అక్కయ్యపాలెం ప్రజలకు కరెంట్ కష్టాలు లేనట్టే. జీవీఎంసీ 26వ వార్డులోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు విద్యుత్ సమస్యలు తీరనున్నాయి. ముఖ్యంగా 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీ, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, రామకృష్ణానగర్, 80 ఫీట్ రోడ్, శాంతిపురం, లలితానగర్, 44వ వార్డు అబిద్‌నగర్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను వేసవి వచ్చిందంటే విద్యుత్ కష్టాలు వెంటాడేవి. విద్యుత్ వినియోగం పెరగడంతో తరచూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ట్రిప్ అవడం, లో ఓల్టేజీ, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులతో ఇబ్బంది పడేవారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

గత పదేళ్లలో ఇళ్లల్లో ఏసీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, మోటార్ల వాడకం బాగా పెరిగింది. దీంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరగడం, ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్‌పడటంతో తరచూ ట్రిప్ అయ్యేది. డిమాండ్‌కు తగ్గ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ లేక విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. అక్కయ్యపాలెం ప్రాంతానికి విద్యుత్ సరఫరాకు ఇప్పటి వరకు రెండు 8 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా.. ప్రజల విద్యుత్ వినియోగాన్ని తీర్చలేకపోతున్నాయి. ముఖ్యంగా వేసవిలో ఈ సమస్య అధికంగా ఉంటుంది. గత పదేళ్లల్లో కొత్తగా సబ్‌స్టేషన్ ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు శాచురేషన్‌కు చేరుకున్నాయి.

కె.కె.రాజు హామీతో సమస్య పరిష్కారం

ఇటీవల వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పర్యటించినపుడు స్థానికులు తమ విద్యుత్ కష్టాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వాటిని తీరుస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు. 26వ వార్డు విద్యుత్ సమస్యలను ఏపీఈపీడీసీఎల్ సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. అక్కయ్యపాలెంలో నివసిస్తున్న సుమారు 25 వేల మంది ప్రజలు, 8 వేల కనెక్షన్ల విద్యుత్ డిమాండ్‌కు తగినట్టు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దానికి తగిన స్థలం లేకపోవడంతో సుమారు రూ.10 కోట్లతో అక్కయ్యపాలెం హైవేపై గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో అత్యాధునిక టెక్నాలజీతో 5 ఎంవీఏ కంటైనర్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. 1000 ఓల్ట్స్, 5 వేల యాంప్ కెపాసిటీ ఉంటుంది. దీనివల్ల 8 వేల విద్యుత్ కనెక్షన్లకు, 25 వేల జనాభాకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. రాష్ట్రంలోని విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న మూడో కంటైనర్ సబ్‌స్టేషన్ ఇది. రెండు నెలలుగా జరుగుతున్న పనులు ప్రస్తుతం కొలిక్కి వచ్చాయి. కొద్ది రోజుల్లోనే సబ్‌స్టేషన్ పనిచేయనుంది. దీంతో అక్కయ్యపాలెం ప్రాంతానికి ఎటువంటి ఇబ్బంది లేని విద్యుత్ సరఫరా లభిస్తుంది. మరో పదేళ్లలో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌ను సైతం తీర్చేలా దీని ఏర్పాటు శరవేగంగా జరుగుతోంది. భవిష్యత్ అవసరాలకు 8 ఎంవీఏకి అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. విద్యుత్ సమస్యలు పరిష్కారమవడంతో అక్కయ్యపాలెం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిరకాల సమస్యను పరిష్కరించారు



వేసవి కాలం వచ్చిందంటే అక్కయ్యపాలెం ప్రజలకు కరెంట్ కష్టాలు మొదలైనట్టే. పదేళ్లుగా విద్యుత్ సరఫరాలో వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం. గడగ గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కె.కె.రాజు దృష్టికి కరెంట్ సమస్యను తీసుకెళ్లాం. వెంటనే ఆయన స్పందించి సమస్యకు పరిష్కారం చూపారు.

– తాళాసు సాయిమోహన్, ఎన్‌జీజీవోస్ కాలనీ

సబ్‌స్టేషన్ ఏర్పాటు సంతోషకరం



అక్కయ్యపాలెంలో గత పదేళ్లలో ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్ల వాడకం బాగా పెరిగింది. విద్యుత్ కనెక్షన్ల సంఖ్య అధికమైంది. డిమాండ్‌కు తగినట్టు కొత్తగా సబ్‌స్టేషన్ ఏర్పాటు కాలేదు. అడిగితే స్థలం లేదనేవారు. కె.కె.రాజు చొరవతో విద్యుత్ సమస్యలు తీరేలా నూతన కంటైనర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది.

– భోగి ప్రవీణ్‌కుమార్, అక్కయ్యపాలెం